సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 19 । జూలై । 2024



రోజంతా ముసురే.. 8లో

జిల్లాలో తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. రోజంతా వాన కురవడంతో జనజీవనం స్తంభించింది.



ఎన్టీపీసీకి మరో అవార్డు

పరవాడ: పర్యావరణ పరిరక్షణలో ఎన్టీపీసీకి బ్యాంకాక్‌కు చెందిన గ్రీన్‌టెక్ ఫౌండేషన్ నుంచి గ్లోబల్ ఈహెచ్ఎస్ అవార్డు లభించింది.



రేపే గిరి ప్రదక్షిణ 8లో

సింహగిరి ప్రదక్షిణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 4 గంటలకు తొలిపావంచా వద్ద ప్రదక్షిణ ప్రారంభమవుతుంది.

న్యూస్‌రీల్

పూడిమడక హైస్కూల్‌కు రూ.20 లక్షల విరాళం



పూడిమడక హైస్కూల్‌లో వర్ధమాన్ కంపెనీ ప్రతినిధులు

మునగపాక (అచ్యుతాపురం): అచ్యుతాపురం మండలం పూడిమడక జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధికి వర్ధమాన్ కంపెనీ ముందుకొచ్చింది. కంపెనీ వార్షికోత్సవంలో భాగంగా గురువారం సైన్స్ ల్యాబ్, డైనింగ్ టేబుల్, బెంచీలకు అవసరమయ్యే రూ.20 లక్షలను సీఎస్ఆర్ నిధుల నుంచి విరాళంగా అందజేశారు. కంపెనీ ఎండీ సజీవ్ నరుల్లా, డైరెక్టర్ నిరాజ్ హెబట్, రావు, రాకేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఉత్తమ రక్తదాత సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి

- అవార్డు అందించిన ఇండియన్ రెడ్‌క్రాస్



అవార్డు అందుకుంటున్న చోడవరం సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి

చోడవరం: ప్రాణాలు కాపాడటంలో రక్తం ఎంత కీలక పాత్ర పోషిస్తుందో అందరికీ తెలుసు. రక్తదానం చేసి ఎందరికో ప్రాణదాతగా నిలిచిన చోడవరం సబ్ రిజిస్ట్రార్ బి.గీతాలక్ష్మికి ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఉత్తమ రక్తదాతగా అవార్డు ఇచ్చి సత్కరించింది. శ్రీకాకుళంలో గురువారం జరిగిన కార్యక్రమంలో గీతాలక్ష్మికి అక్కడి జాయింట్ కలెక్టర్ నవీన్, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు ఈ అవార్డును అందజేశారు. సబ్ రిజిస్ట్రార్‌గా ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నప్పటికీ మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఒకపక్క రాణిస్తూ ఎందరో పేద క్రీడాకారులకు ఆర్థికసాయం అందిస్తున్నారు గీతాలక్ష్మి. అంతే కాకుండా ఆమె చేసిన రక్తదానం ఎందరికో ప్రాణం పోసింది. ఆమె అనేకసార్లు రక్తదానం చేయడమే కాక సొంత ఖర్చుతో ఐదుసార్లు వివిధ ప్రదేశాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించారు.

'తారకరామ' సాగునీటి కాలువల్లో పూడిక తొలగింపు

మాడుగుల రూరల్: తారకరామ జలాశయానికి సంబంధించిన సాగునీటి కాలువల్లో పూడిక తీత చేపట్టారు. ఉపాధి హామీ పథకం కూలీలు, రైతులు కలిసి గత మూడు రోజులుగా పూడిక తీత పనులు నిర్వహించారు. ఈ పనులను స్థానిక నీటి సంఘం అధ్యక్షుడు అప్పాన వెంకటరమణ రైతులతో కలిసి గురువారం పర్యవేక్షించారు. ఖరీఫ్ సాగునీటి అవసరాలకు పూడికతీత ఎంతో ఉపయోగపడుతుంది. ఈ పనులను ఇరిగేషన్ జేఈ రాజేష్, డీఈఈ, ఇతర అధికార్లతో కలిసి పరిశీలించారు. వీరి వెంట పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, అప్పాన భాస్కరావు, పడాల చాణక్య, మజ్జి విశ్వనాథం, తదితరులు ఉన్నారు.



ఎన్నాళ్లీ ఎదురుచూపులు?

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది.. రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు.. రూ.2 వేలు వంతున కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ విడుదలై నెల కావస్తోంది. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఆర్థిక సాయం అందించకపోవడంతో పెట్టుబడుల కోసం రైతన్నలు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. వ్యవసాయ రంగంపై చంద్రబాబుకు ఎందుకీ కక్ష అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి, అనకాపల్లి:

గడచిన నాలుగేళ్లు తొలకరి సీజన్‌కు పెట్టుబడి సాయం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిసాన్ సమ్మాన్ నిధి, రైతు భరోసా ఒకేసారి అందించాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండూ కలిపి రైతులకు ఏటా మూడు దఫాలుగా రూ.13,500 అందించారు. ఇందులో తొలి విడతగా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే మే నెలలోనే కేంద్రం రూ.2,000, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,500 కలిపి మొత్తం రూ.7,500 రైతులకు అందజేసేవి. దీనివలన జిల్లాలో 2,50,888 మంది చిన్న, సన్నకారు, పేద రైతులు ఖరీఫ్ పెట్టుబడి కింద రూ.752.66 కోట్ల మేర లబ్ధి పొందారు.

- పీఎం కిసాన్ విడుదలై నెల కావస్తున్నా దక్కని 'భరోసా'
- రాష్ట్ర సర్కారు సాయం కోసం రైతన్నల నిరీక్షణ
- వైఎస్సార్‌సీపీ హయాంలో పీఎం కిసాన్‌తో పాటే రైతు భరోసా
- ఏటా మూడు దఫాలుగా రూ.13,500ల పెట్టుబడి సాయం

ఇది పెట్టుబడి తరుణం

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద తొలి విడతలో రూ.2 వేల చొప్పున రూ.37.72 కోట్లు విడుదల చేసింది. **జూన్ 18వ తేదీన అందించిన ఈ సాయంతో జిల్లాలోని 1,88,614 మంది రైతుల లబ్ధి పొందారు. రాష్ట్రంలో కొత్తగా పగ్గాలు చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధం**గా రైతుకు అందించాల్సిన ఆర్థిక సాయంపై ఇప్పటి వరకూ ఎటువంటి ప్రకటనా చేయలేదు. రైతులు నారుమళ్లు వేసుకొనేందుకు సిద్ధమవుతున్నారు. అక్కడక్కడ వేశారు కూడా. ఇటువంటి తరుణంలో వారికి సాగు పెట్టుబడులకు డబ్బులు అవసరమవుతాయి. విత్తనాల కొనుగోలు, నారుమడులు దమ్ము చేసుకొనేందుకు వారికి పెట్టుబడి సాయం ఎంతో అవసరం.

కళ్లు కాయలు కాసేలా..

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు కేంద్ర, **రాష్ట్ర ప్రభుత్వాలు క్రమం తప్పకుండా సాయం అందించడంతో రైతులకు ఊరట కలిగింది. ఖరీఫ్ సీజన్‌కు ముందే ప్రభుత్వం సాయం అందించడంతో రైతులు పెట్టుబడి కోసం ఒక్క రూపాయి కూడా అప్పు చేయాల్సిన పరిస్థితి ఉండేది కాదు. కానీ ఈ** ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా.. రైతు భరోసా రాలేదు.

ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించిన చంద్రబాబు 45 రోజుల పాలన పూర్తయినా.. దానిపై నోరు మెదపలేదు. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువు తీరి రోజులు గడుస్తున్నా.. రైతులకు పెట్టుబడి సాయం గురించి ఇటు సీఎం చంద్రబాబు కానీ, అటు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు కానీ మాట్లాడలేదు.

ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నాం..



మాది అనకాపల్లి జిల్లా బుచ్చింపేట గ్రామం. నాకు 2 ఎకరాల పొలం ఉంది. వరి నారు వేశాను. మరో 20 రోజుల్లో నారు ఎదుగుతుంది. ఇప్పటికే వర్షాలు విస్తృతంగా పడుతున్నాయి. వరి నాట్లు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం అందించే పెట్టుబడి కోసం చూస్తున్నాను. లేదంటే అప్పు చేసి వరి నాట్లు వేస్తాను. గత ఐదేళ్లలో నాలుగేళ్లపాటు రైతు భరోసా అందింది. పెట్టుబడి సాయంగా ఉండేది. ఈ ఏడాది పెట్టుబడి సాయం ఇంకా రాలేదు. ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందా అని ఎదురుచూస్తున్నాం.

– సామిరెడ్డి నరసింహమూర్తి, బుచ్చింపేట గ్రామం, రోలుగుంట మండలం

అప్పు చేయాల్సిన పరిస్థితి



గత నాలుగేళ్ల మాదిరి రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద ఆర్థిక సాయం అందిస్తే రైతును ఆదుకున్నట్లు అవుతుంది. లేదంటే అప్పు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. వర్షాలు పడుతున్నాయి. ప్రభుత్వం ఆర్థిక సాయం కూడా గతంలో మాదిరి మా కుటుంబాలు ఆనందంగా ఉంటాయి. మా చేతికి పంట దిగుబడి వచ్చేవరకు బిక్కు బిక్కుమంటూ వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వ బీమా, రైతు భరోసా లాంటివి కల్పిస్తూ రైతును ఆదుకోవాలని కోరుకుంటున్నాను.

– అన్నంరెడ్డి కొండబాబు, రైతు, బుచ్చింపేట గ్రామం, రోలుగుంట మండలం

రైతున్నను ఆదుకోవాలి..



ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతు భరోసా కింద రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించి రైతన్నను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. రైతులంతా వరి నారు మడులు వేసుకుని నాట్లకు సిద్ధంగా ఉన్నారు. ఖరీఫ్ సీజన్‌కు వారం రోజుల ముందే ఆర్థిక సహాయం అందిస్తే.. వారు పెట్టుబడులకు అప్పులు చేయకుండా ఉంటారు. లేదంటే వడ్డీలు పెరిగిపోతాయి. ఇటు దిగుబడి సరిగ్గా లేకపోతే రైతులకు నష్టం వాటిల్లి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడుతుంది.

– పీలా బుజ్జి, తుమ్మపాల గ్రామం, రైతు సంఘం అధ్యక్షుడు

గంజాయిపై నిరంతర నిఘా



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ దీపిక

- సిబ్బందికి ఎస్పీ దీపిక ఆదేశాలు

మాకవరపాలెం: గంజాయి రవాణాపై నిరంతర నిఘా ఉంచాలని ఎస్పీ దీపిక ఆదేశించారు. నూతనంగా విధుల్లో చేరిన ఆమె మొదటిగా మాకవరపాలెం పోలీస్ స్టేషన్‌ను గురువారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. గంజాయి రవాణాపై నిత్యం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కూడా నిఘా ఉంచుతూ శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలను సహించేది లేదని హెచ్చరించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అలక్ష్యం వహించవద్దని నర్సీపట్నం రూరల్ సీఐ హరి, స్థానిక ఎస్ఐ రామకృష్ణారావులను ఆదేశించారు.

స్పీకర్‌ను కలిసిన ఎస్పీ

నర్సీపట్నం: అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని ఎస్పీ దీపిక గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో గంజాయి వ్యాప్తి పెరగడం వల్ల యువత చెడిపోవడమే కాకుండా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఎస్పీని ఈ సందర్భంగా ఆదేశించారు. ఏజెన్సీలో పండిస్తున్న గంజాయి మైదాన ప్రాంతాల్లో విచ్చలవిడిగా దొరకుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నేరాల సంఖ్య తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల భవనాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తే సీఎంతో మాట్లాడి వాటి నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు.

ఏయూ ఇన్‌చార్జ్ వీసీ బాధ్యతల స్వీకారం



ప్రొఫెసర్ శశిభూషణరావుకు అభినందనలు

సాక్షి, విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ జి.శశిభూషణ రావును నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీసీ చాంబర్‌లో ఇన్‌చార్జి వీసీగా గురువారం రాత్రి ఆయన పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఏయూ ఈసీఈ విభాగం సీనియర్ ప్రొఫెసర్‌గా, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొ.శశిభూషణ రావు ప్రస్తుతం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. 35 సంవత్సరాల సుదీర్ఘ బోధన అనుభవం ఉన్న ఈయన ఏయూలో ఈసీఈలో బీటెక్, జేఎన్‌టీయూలో ఎంటెక్ పూర్తి చేశారు. ఉస్మానియా వర్సిటీ నుంచి పీహెచ్‌డీలను పూర్తిచేశారు. ఆయనకు 5 పేటెంట్లు సైతం ఉన్నాయి. ఆయన పర్యవేక్షణలో 51 మంది డాక్టరేట్లను అందుకున్నారు. 275కు పైగా పరిశోధన పత్రాలను, వివిధ స్కోపస్ జర్నల్స్ ప్రచురించారు. 5 పాఠ్యపుస్తకాలను, వివిధ పుస్తకాలలో 11 చాప్టర్లు సైతం రచించారు. 2008లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ బెస్ట్ అకడమీషియన్ అవార్డును, బెస్ట్ రీసెర్చర్ అవార్డును అందుకున్నారు. ఆయన పర్యవేక్షణలో 9 రీసెర్చ్ ప్రాజెక్టులను పూర్తిచేశారు. వివిధ జర్నల్స్‌కు ఎడిటర్‌గా వ్యవహరించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు అభినందనలు తెలిపారు.

అన్ని రంగాల్లో అగ్రగామిగా..



అధికారులతో కలిసి స్పీకర్ అయ్యన్నపాత్రుడితో భేటీ అయిన కలెక్టర్ విజయ కృష్ణన్

- జిల్లాను తీర్చిదిద్దేందుకు కృషి
- కలెక్టర్ విజయ కృష్ణన్

నర్సీపట్నం: జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానని కలెక్టర్ విజయ కృష్ణన్ చెప్పారు. గురువారం నర్సీపట్నం సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో ఆర్డీవో హెచ్.వి.జయరాంతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం తనను కలిసిన విలేకర్లతో మాట్లాడుతూ.. జిల్లాపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొని ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచన మేరకు నర్సీపట్నం మున్సిపాలిటీలో శానిటేషన్ మెరుగుదలకు, ఏరియా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆస్పత్రిలో త్వరలోనే రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు.

స్పీకర్‌ను కలిసిన కలెక్టర్

కలెక్టర్ విజయ కృష్ణన్ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను కలెక్టర్‌తో అయ్యన్న చర్చించారు. నర్సీపట్నం ఇసుక యార్డుపై వచ్చిన ఆరోపణలపై వీలైనంత తొందరగా విచారణ పూర్తి చేయాలని కోరారు. మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, మరమ్మతులకు గురైన పారిశుధ్య యంత్రాలను వదిలేసి అద్దె జేసీబీల ద్వారా పనులు నిర్వహిస్తున్నారని, దీనివల్ల మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతోందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా సక్రమంగా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వేములపూడి బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వివరించారు. వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ స్పీకర్‌కు తెలిపారు. ఆమె వెంట ఆర్డీవో హెచ్.వి.జయరాం, మున్సిపల్ కమిషనర్ రవిబాబు ఉన్నారు.

ప్రాథమిక దశలో కుష్టు వ్యాధి నిర్ధారణకు సర్వే

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారి లూసీ కార్డీలియా



గవరపాలెంలో కుష్టు వ్యాధి లక్షణాల పరిశీలన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న లూసీ కార్డీలియా

కె.కోటపాడు: కుష్టువ్యాధి లక్షణాలున్న వారిని ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు వైద్య సిబ్బందిచే సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారి లూసీ కార్డీలియా తెలిపారు. గవరపాలెంలోని హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. వెల్‌నెస్ కేంద్రం ద్వారా రోజూ ఎంత మందికి వైద్య సేవలు అందిస్తున్నారు, ఏయే పరీక్షలు నిర్వహిస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కుష్టు వ్యాధి లక్షణాలున్నవారిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మెరుగైన వైద్యం అందించడం ద్వారా, వారు అంగ వైకల్యం బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని వైద్య సిబ్బందికి సూచించారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్‌వో నాగమణి, గణాంక అధికారి జనార్దన్, డేటా మేనేజర్ దినేష్, హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, పీహెచ్ఎన్ ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పీ నిత్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శిరస్త్రాణం.. రక్షణాస్త్రం 8లో

నర్సీపట్నంలో భారీగా అవగాహన ర్యాలీ

తీరం అల్లకల్లోలం

- రుషికొండలో నిలిచిన బోటు షికారు



అల్లకల్లోలంగా మారిన తీరం

కొమ్మాది (విశాఖ): బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా సాగర్‌నగర్, రుషికొండ, మంగమారిపేట, ఉప్పాడ, భీమిలి సముద్ర తీరం గురువారం సాయంత్రం అల్లకల్లోలంగా మారింది. సముద్ర కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడటంతో పాటు బలంగా గాలులు వీయడంతో మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. తమ విలువైన బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వాతావరణంలో మార్పులతో రెండు రోజుల పాటు వేటకు విరామం చెప్పినట్లు మత్స్యకారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. రుషికొండ బీచ్‌లో బోటు షికారును నిలిపివేశారు. సముద్రంలో పెద్ద ఎత్తున అలలు ఎగసి పడటంతో బోటు షికారు నిలిపివేశామని, పర్యాటకులు గమనించాలని నిర్వాహకులు సూచించారు. బోట్లను తీరంలో భద్రపరిచారు.

పరిశ్రమల్లో కార్మికులకు భద్రత ఎక్కడ?



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీపీఎం నేత లోకనాథం

- సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి: అచ్యుతాపురం సెజ్‌లోని వసంత కెమికల్స్‌లో రియాక్టర్ పేలిన ఘటనలో మృతి చెందిన ప్రదీప్ రౌత్ కుటుంబాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం గురువారం అనకాపల్లి వైద్యాలయంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆరోపించారు. పని ప్రదేశాల్లో కార్మికులకు భద్రత లేకుండా పోతోందని, తనిఖీలు చేయడంలో ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు.

ఇటీవల కాలంలో అచ్యుతాపురం, పరవాడ ఫార్మా కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో సుమారు 10 మంది వరకు కార్మికులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. ఒడిశా, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల నుంచి నైపుణ్యం లేని కార్మికులకు తీసుకొచ్చి.. ప్రమాదకర ప్రదేశాల్లో పనులు అప్పగిస్తున్నారని ఆరోపించారు. వీరు నివాసం ఉంటున్న రేకుల షెడ్లు మరింత అధ్వానంగా ఉన్నాయన్నారు. పరిశ్రమల్లో లోపాలను సరిచేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఆర్.రాము, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అల్లు రాజు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

- కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: పరిశ్రమల్లో అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ప్రాణనష్టం జరగకుండా..యాజమాన్యం ముందస్తు భద్రతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ స్పష్టం చేశారు. కలెక్టర్ చాంబర్‌లో గురువారం వివిధ విభాగాల అధికారులతో డిస్ట్రిక్ట్ సేఫ్టీ ఆడిట్ కమిటీ సమావేశం జరిగింది. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, అమలుపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. 213 హానికర, రెడ్ కేటగిరీ పరిశ్రమల్లో 143 పరిశ్రమలను తనిఖీ చేసినట్లు కలెక్టర్‌కు కమిటీ సభ్యులు తెలిపారు. మిగిలిన 70 పరిశ్రమలను పరిశీలించాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల రోజుల్లో 40 పరిశ్రమలను పూర్తి స్థాయిలో తనిఖీలు చేసి.. అక్కడ ఉన్న భద్రతా ప్రమాణాలపై నివేదిక రూపొందించాలని ఆదేశించారు. 143 పరిశ్రమలను మళ్లీ తనిఖీ చేయాలని సూచించారు. పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి.. భద్రతా ప్రమాణాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికుల, ఉద్యోగులు పూర్తి వివరాలు యాజమాన్యాలతో పాటు అధికారుల దగ్గర ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీవో చిన్నికృష్ణ, పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, అగ్నిమాపక, కార్మిక, సివిల్ సప్లయిస్, ఏపీఐఐసీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌తో ఎస్పీ ఆత్మీయ భేటీ



కలెక్టర్ విజయ కృష్ణన్‌ను జిల్లా నూతన ఎస్పీగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఎం.దీపిక గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్కను అందించారు. ఆమెకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు సమన్వయంతో పనిచేయాలన్నారు.

- తుమ్మపాల

మాడుగుల మరిడిమాంబకు వెండి కిరీటం బహూకరణ



మాడుగుల మరిడిమాంబ అమ్మవారికి వెండి కిరీటం అందజేస్తున్న దాతలు

మాడుగుల: మాడుగులలో మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు. భక్తుడు కోరుబిల్లి వెంకట్రావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు మూడు లక్షల యాభై వేల రూపాయలు విలువ చేసే మూడు కిలోల వెండి కిరీటాన్ని అమ్మవారికి బహూకరించారు. అమ్మవారి పండగ సందర్భంగా ఆలయ అర్చకులు గురుగుబిల్లి సుబ్బారావు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి పండగ ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పోలిమేర వెంకటరమణ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

యలమంచిలి రూరల్: అనుమానంతో శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న భర్త, అత్తింటి వారిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు యలమంచిలి రూరల్ సిఐ షేక్ గఫూర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు. మండలంలోని పులపర్తి గ్రామానికి చెందిన కార్పెంటర్ సాధనాల లక్ష్మణరావుకు, శ్రీదేవితో 2021లో వివాహమైంది. తనపై అనుమానంతో తరచూ భర్త, అత్తింటివారు వేధింపులకు గురి చేస్తున్నారని బాధితురాలు గురువారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఐపీసీ 498ఏ సెక్షన్ ప్రకారం కేసు నమోచేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

రేపే గిరి ప్రదక్షిణ



సింహాద్రి అప్పన్నా.. అని ఆర్తితో పిలిస్తే అభయహస్తం అందించే స్వామి శ్రీ వరాహ లక్ష్మీ నృసింహుడు. వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని శ్రీ మహా విష్ణువు శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిగా వెలసిన ఆధ్యాత్మిక క్షేత్రం ఇది. చందన పరిమళాలు, సంపెంగ సౌరభాలతో శోభిల్లుతున్న సింహాచల క్షేత్రంలోని ప్రధాన ఉత్సవాల్లో ఒకటి గిరి ప్రదక్షిణ. సింహగిరి చుట్టూ 32 కిలోమీటర్ల మేర కాలినడకన ఒక్కసారి ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణతో సమానమని భక్తులు భావిస్తారు. ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని శనివారం జరిగే గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

- సుమారు 5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా..
- సాయంత్రం 4 గంటలకు తొలిపావంచా వద్ద స్వామి పుష్పరథం ప్రారంభం
- 21న తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయ ప్రదక్షిణలకు అనుమతి
- అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి కొలువైన సింహగిరి ప్రదక్షిణ(గిరి ప్రదక్షిణ) శనివారం జరగనుంది. ఈసారి దాదాపు 5 లక్షల మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో సింహాచలం, రెవెన్యూ, జీవీఎంసీ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, విద్యుత్, ఫైర్, ఎక్సైజ్ తదితర శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులు సేద తీరేందుకు 29 ప్రాంతాల్లో స్టాళ్లు, 22 ప్రదేశాల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా 290 తాత్కాలిక మరుగుదొడ్లు, 11 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, 12 చోట్ల 17 అంబులెన్స్‌లు, 9 జనరేటర్లు, ఆరు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

కంట్రోల్ రూమ్‌లిక్కడే..

సింహాచలంలోని కొండదిగువ కలశం జంక్షన్, అడవివరం, హనుమంతవాక, అప్పుఘర్, మాధవదార, ఎస్ఎస్టీఎల్..

సాయంత్రం 4 గం.కు పుష్పరథం ప్రారంభం

కొండదిగువ స్వామి తొలిపావంచా వద్ద నుంచి శనివారం సాయంత్రం 4 గంటలకు పుష్పరథం ప్రారంభవుతుంది. స్వామి మూలవిరాట్, ఉత్సవమూర్తులు కొలువుదీరిన ప్రచార రథం బయలుదేరుతుంది. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు ఆ సమయానికి తొలిపావంచా వద్దకు చేరుకోవాలి.

ఇవీ దర్శన సమయాలు

20వ తేదీ ఉదయమే గిరి ప్రదక్షిణ ప్రారంభించి అదే రోజు రాత్రికి తిరిగి సింహాచలం చేరుకునే భక్తులకు రాత్రి 10 గంటల వరకు దర్శనాలు లభిస్తాయి. 21 ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు అందజేస్తారు. తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు, రాత్రి 8.30 గంటల నుంచి 9 వరకు భక్తులకు దర్శనాలు లభిస్తాయి.

ఉచిత ప్రయాణం

21వ తేదీ ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొండపై నుంచి దిగువకు భక్తులను దేవస్థానం బస్సులతో పాటు, దేవస్థానం నగదు చెల్లించిన 45 ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా చేరవేస్తారు.

21న ఆలయ ప్రదక్షిణలు

సింహగిరిపై 21న ఆలయ ప్రదక్షిణలు చేసే భక్తులను తెల్లవారుజామున 3 గంటల నుంచి అనుమతిస్తారు.

మరుగుదొడ్లు ఇక్కడే..

తొలి పావంచా, అడవివరం గ్రౌండ్, పైనాపిల్ కాలనీ, సెంట్రల్ జైల్, ముడసర్లోవ, చిగదిలి, పెదగదిలి, ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి, అప్పుఘర్, వెంకోజీపాలెం, డాక్‌యార్డ్ క్వార్టర్స్, పోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్, మాధవధార, కుమారి కల్యాణ మండపం, శ్రీనివాసనగర్, పాత గోశాల జంక్షన్, శ్రీదేవి కాంప్లెక్స్, మెట్లమార్గం..

వైద్య శిబిరాలివే..

తొలి పావంచా, ముడసర్లోవ పార్కు, జోడుగుళ్లపాలెం, అప్పుఘర్, వెంకోజీపాలెంలోని ఆంజనేయ స్వామి ఆలయం, పోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, మాధవధార, ఎస్ఏడీ జంక్షన్, కుమారి కల్యాణమండపం, పాతగోశాల జంక్షన్, సింహగిరి మెట్ల మార్గం..

పుష్పరథం తిరిగే మార్గం

తొలిపావంచా, అడవివరం, పైనాపిల్‌కాలనీ, సెంట్రల్ జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటిపార్కు, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, ఎస్ఏడీ కొత్తరోడ్డు, గోపాలపట్నం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకుంటుంది.

విశేషంగా ఏర్పాట్లు

- సింహాచలంలోని తొలిపావంచా వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు 50 క్యూలు, 80 ఇనుప గడ్డర్లు సిద్ధం చేస్తున్నారు. బీఆర్‌టీఎస్ మార్గంలోని కొత్త ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద 20 ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేస్తున్నారు.
- అప్పుఘర్ వద్ద స్నానాలు ఆచరించే భక్తుల సౌకర్యార్థం 40 తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, 80 ఎల్‌ఈడీ దీపాలు, జనరేటర్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంను ఏర్పాటు చేస్తున్నారు. 20 మంది గజ ఈతగాళ్లు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తారు.
- మాధవధార వద్ద 40 తాత్కాలిక టాయిలెట్లు, ఓ వైద్య శిబిరం, 50 ఎల్‌ఈడీ లైట్లు, ఓ జనరేటర్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంను సిద్ధం చేస్తున్నారు.
- 21న భక్తులందరికీ అన్నప్రసాద భవనం వద్ద కదంబం, దద్దోజనం ప్రసాదంగా అందిస్తారు.
- కొండదిగువన 29, కొండపైన 3 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు.
- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.
- 21న ఆలయ ప్రదక్షిణలకు సంబంధించి ఉత్తర రాజగోపురం, దక్షిణ రాజగోపురం వద్ద వంతెనలను సిద్ధం చేస్తున్నారు. బ్రిడ్జిలపై నుంచి ప్రదక్షిణలు చేసే భక్తులు, కింద నుంచి దర్శనానికి భక్తులు వెళ్లేలా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

భక్తులు ప్రదక్షిణ చేసే మార్గం

సింహాచలంలోని తొలి పావంచా, అడవివరం, పైనాపిల్ కాలనీ, సెంట్రల్ జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్క్, అప్పుఘర్, ఎంవీపీకాలనీ, సీతమ్మధార, నరసింహనగర్, పోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, కప్పరాడ, మురళీనగర్, మాధవధార, ఆర్అండ్‌బీ కార్యాలయం, లక్ష్మీనగర్, కుమారి కల్యాణ మండపం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకోవాలి.

షిర్డీ సాయి ఆలయ కమిటీ రాజీనామా



కమిటీ సభ్యులతో సమావేశమైన అధ్యక్షులు కర్రి రాంగోపాల్

నర్సీపట్నం: స్థానిక షిర్డీ సాయి ఆలయ కమిటీ గురువారం రాజీనామా చేసింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు కర్రి రాంగోపాల్ మాట్లాడుతూ రాజకీయాలతో ప్రమేయం లేకుండా షిర్డీ సాయి ఆలయాన్ని కొన్నేళ్లుగా అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నామన్నారు. ప్రభుత్వం మారడంతో కొంత మంది టీడీపీ నాయకులు వచ్చి, కమిటీ రాజీనామా చేస్తే, కొత్త కమిటీని ఏర్పాటు చేసుకుంటామని చెప్పారని తెలిపారు. బాబా ఆలయంపై రాజకీయం చేసే ఉద్దేశం తమకు లేనందున, కొత్త వారికి అవకాశం ఇవ్వాలనే ఆలోచనతో కమిటి సభ్యులంతా రాజీనామా చేసినట్లు వెల్లడించారు. తన పిన్ని కర్రి అచ్చియ్యమ్మ ఆలయానికి 13 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చారని, ఆలయ పురోహితులకు ఆ స్థలంలో రెండు పోర్షన్ల ఇల్లు కట్టించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆలయ మండపం నిర్మాణానికి రూ.2.5 లక్షలు విరాళం అందించిన కొత్తకోటకు చెందిన దాత పెనుకొండ బంగారంనకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్న తృప్తి తమకు ఉందన్నారు.

సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ రామచంద్రరాజు, లంక ఈశ్వరరావు, పోతుల సత్తిబాబు, లాలం చినఅప్పారావు, ఎకా రాజుబాబు, కర్రి దుర్గాప్రసాద్, మీసాల సత్యనారాయణ, మల్లిఖార్జునరావు, మంతిన రమణారావు, మోటూరి లోవరాజు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణ ట్రాఫిక్ ఆంక్షలు



సింహగిరి వ్యూ

విశాఖ సిటీ: సింహాచలం గిరి ప్రదక్షిణకు పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నామని.. ప్రజలు ఈ మార్పులను గమనించి సహకరించాలని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి విజ్ఞప్తి చేశారు.

పోలీసుల సూచనలివే..

- గిరి ప్రదక్షిణ జరిగే ప్రాంతాల్లో 20, 21 తేదీల్లో ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలి.
- 20వ తేదీ ఉదయం నుంచి అడవివరం, పాత గోశాల జంక్షన్ మధ్య ఎటువంటి వాహనాలను అనుమతించరు. ప్రత్యామ్నాయంగా వేపగుంట, పెందుర్తి, అక్కిరెడ్డిపాలెం, దువ్వపాలెం జంక్షన్ మీదుగా ప్రయాణించాలి.
- అడవివరం నుంచి గిరి ప్రదక్షిణకు తొలి పావంచా వద్దకు వచ్చే భక్తులు వాహనాలను అడవివరం జంక్షన్‌లోపార్కింగ్ చేయాలి. అక్కడి నుంచి కాలినడకన రావి చెట్టు జంక్షన్, గాంధీనగర్, కోనేరు మీదుగా కలశం జంక్షన్‌కు చేరుకోవాలి.
- వేపగుంట, సింహపురికాలనీ నుంచి వచ్చే భక్తులు పాత గోశాల వద్ద పార్కింగ్ చేసుకుని తొలిపావంచాకు వెళ్లాలి.
- అనకాపల్లి నుంచి శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లే వాహన చోదకులను విశాఖ సిటీలోకి అనుమతించరు. వీరు లంకెలపాలెం, సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం వైపు ప్రయాణించాలి.
- శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచే అనకాపల్లి వైపు వెళ్లే వాహనచోదకులు నగరంలోకి రాకుండా ఆనందపురం, పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి చేరుకోవాలి.
- భక్తుల రద్దీ దృష్ట్యా పెదవాల్తేరు, కురుపాం జంక్షన్ నుంచి బీచ్ రోడ్డులో ఎటువంటి వాహనాలను అనుమతించరు.
- హనుమంతువాక, వెంకోజీపాలెం వద్ద భక్తులు రహదారి దాటే సమయంలో వాహనదారులకు కొంత మేర అసౌకర్యం ఉన్నప్పటికీ.. జాతీయ రహదారిపై మాత్రమే ప్రయాణించాలి.
- ఆరిలోవ హెల్త్ సిటీకి వెళ్లాల్సిన వారు ఆదర్శనగర్ ఓల్డ్ డైరీఫారం నుంచి ఆరిలోవ మీదుగా చేరుకోవాలి.
- అనకాపల్లి, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ వెళ్లాల్సిన అన్ని ప్రైవేటు వాహనాలు, ట్రావెల్ బస్సులు ఆనందపురం వద్ద మళ్లించనున్నారు.

రోజంతా ముసురే..

- ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం



సాక్షి, అనకాపల్లి: జిల్లా తడిచి ముద్దయింది. తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉంది. అప్పుడప్పుడు చిరుజల్లులు పలకరిస్తున్నా.. వేడి మాత్రం కాస్త ఉక్కిరి బిక్కిరి చేసింది. గురువారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అయితే ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ఉద్యోగులు, పనుల నిమిత్తం వెళ్లే వారు కాస్త ఇబ్బంది పడ్డారు. అల్పపీడనం కారణంగా మరో అయిదు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

ప్రాంతం-వర్షపాతం(మిమీల్లో)	
కె.కోటపాడు	10.5
ఎస్.రాయవరం	9.25
పరవాడ	9.0
కోడూరు	8.25
యలమంచిలి	8.0
కొక్కిరాపల్లి	7.5
అనకాపల్లి	7.25

కొండెంపూడి భూముల వద్ద పోలీస్ బందోబస్తు



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

బుచ్చెయ్యపేట: కొండెంపూడిలో టీడీపీ నాయకులు దౌర్జన్యం చేసి, రైతులు సాగు చేస్తున్న సరుగుడు మొక్కలు, పశుగ్రాసాన్ని ధ్వంసం చేయడంతో పోలీసులు గురువారం భూముల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరు వర్గాలవారు వివాదాస్పద భూముల్లోకి రాకుండా గొడవలు పడకుండా ఉండేలా బుచ్చెయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ శ్రీకాంత్ ఆదేశాలతో వీఆర్వో సత్యనారాయణ గొడవలు పడుతున్న భూముల వద్ద ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేశారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన పంటలను టీడీపీ నాయకులు ధ్వంసం చేయడంపై సాగు రైతులు విచారం వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 5లో ఉన్న భూములు ఎవరివో రెవెన్యూ అధికార్లు తేల్చేవరకు ఎవరూ భూముల్లోకి దిగవద్దని పోలీసులు ఇరు వర్గాల వారికి సూచించారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

మాకవరపాలెం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. మండలంలోని జంగాలపల్లి సమీపంలో ఉన్న సర్పానది నుంచి ఎడ్ల బళ్లపై ఇసుకను ఒకచోట నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇసుక తరలింపుపై అందిన సమాచారంతో గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సునీల్‌కుమార్ సిబ్బందితో కలసి దాడి చేశారు. మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేలు చొప్పున జరీమానా విధించి, నగదు వసూలు చేసినట్లు సీఐ తెలిపారు. ఇవే ట్రాక్టర్లు రెండో సారి పట్టుబడితే రూ.20 వేలు, మూడోసారి దొరికితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

గంజాయి కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

అనకాపల్లి: గంజాయి కేసులో ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన బి.రాజుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరీమానా విధిస్తూ జిల్లా పదో అదనపు న్యాయమూర్తి నందనవనం శ్రీవిద్య గురువారం తీర్పునిచ్చినట్లు పట్టణ సీఐ జి.శంకరరావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు. 2018 నవంబర్ 2న అప్పటి ఎస్ఐ వి.చక్రధరరావు, ఏఎస్ఐ వి.అప్పారావులు స్థానిక రైల్వే స్టేషన్ రహదారిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో మెయిన్ రోడ్డు నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న బి.రాజు బ్యాగ్‌ను తనిఖీ చేయగా బ్యాగ్‌లో 8 కేజీల గంజాయిని గుర్తించారు. అక్కడి మధ్యవర్తుల సమక్షంలో దాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ చక్రధరరావు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా వాదోపవాదాల అనంతరం న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చినట్లు సీఐ వెల్లడించారు. రూ.10 వేలు జరీమానా చెల్లించని పక్షంలో మరో 6 నెలల పాటు సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు.

శిరస్త్రాణం.. రక్షణాస్త్రం



ర్యాలీలో న్యాయమూర్తి మధుసూదన్‌రావు, న్యాయవాదులు, పోలీసులు, విద్యార్థులు

నర్సీపట్నం: వాహనదారులు విధిగా హెల్మెట్లు ధరించాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు పిలుపునిచ్చారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ల వాడకంపై గురువారం న్యాయవాదులు, పోలీసులు, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్టు నుంచి అబీద్ సెంటర్ వరకు ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ హెల్మెట్లు ధరించకపోవటం వల్ల అనేక మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. ఈ ర్యాలీలో ఎస్సైలు సుధాకర్, ఉమామహేశ్వరరావు, బార్ అసోసియేషన్ ప్రతినిధి మెట్టా ప్రభాకర్, కె.శివనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టమాటా కిలో ‘రూ.80

కశింకోట: టమాటా ధర ఒక్కసారిగా కిలోకి రూ.30 పెరిగింది. కశింకోట వారపు సంతలో గత వారం కిలో రూ.50 ఉండగా, ఈ వారం రూ.80కి పెరిగింది. ఉల్లిపాయ, బరబాటి, బెండకాయ, వంకాయ రూ.40, బీరకాయ రూ.50, క్యారెట్, బీట్‌రూట్ రూ.60, క్యాప్సికం, బీన్స్ రూ.వంద చొప్పున విక్రయాలు సాగాయి.

నటుడు ఎస్వీఆర్‌కు నివాళి

కశింకోట: మండలంలోని గొబ్బూరు గ్రామంలో ప్రముఖ సినీ నటుడు దివంగత ఎస్వీ రంగారావు వర్ధంతిని గురువారం నిర్వహించారు. స్థానిక నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో గొంతిన చిరంజీవి, ఉల్లింగల రమేష్, జెర్రిపోతుల నూకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వదలని వాన



కశింకోటలో వర్షంలో నిర్వహిస్తున్న వారపు సంత

కశింకోట: అల్ప పీడనం ప్రభావంతో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు మండలంలో వాన కురుస్తూనే ఉంది. వరి నారు మళ్లు, చెరకు తోటలకు ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు తెలిపారు. అయితే, వర్షానికి రోడ్లు బురదమయంగా మారాయి. కశింకోటలోని పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. వారపు సంత ప్రాంతం చిత్తడిగా మారింది. కొందరు వ్యాపారులు గొడుగులు, టార్పాలిన్‌లు వేసుకుని, మరికొందరు వర్షంలో తడుస్తూ విక్రయాలు చేశారు. వినియోగదారులు వానలో ఇబ్బంది పడ్డారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభం

తుమ్మపాల: స్థానిక గవరపాలెంలో కొణతాల సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో గురువారం జనసేన నాలుగో విడత సభ్యత్వ నమోదు ప్రక్రియను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పది రోజుల పాటు ఈ నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. సభ్యత్వ నమోదు తీసుకున్న తొలి తెలుగు అశోక చక్ర అవార్డు గ్రహీత దివంగత కరణం వరప్రసాద్ తల్లిదండ్రులు కరణం వెంకటరమణ, సత్యవతి, తదితరులకు కొణతాల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బుదిరెడ్డి చిన్న, చదరం నాగేశ్వరరావు, మంగా ఈశ్వర్, తాడి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 51 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	--	--
మూడోరకం	3,400	3,600

అనకాపల్లి సినిమాలు

పేకమేడలు	: రాజా
కల్కి2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-2
డార్లింగ్	: షిర్డిసాయి
భారతీయుడు 2	: పర్తిసాయి
క్రైం రీల్	: వెంకటేశ్వర
నరబలి	: శ్రీసత్య
ద బర్త్‌డే బోయ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 102 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-14 యూనిట్లు, బీ పాజిటివ్-38 యూనిట్లు, ఓ పాజిటివ్-48 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 247 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 162 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- తొలకరి పలకరింపుతో పనుల్లో నిమగ్నమైన రైతులు
- వరిలో ఎద పద్ధతిపై ఆసక్తి
- పల్లపు ప్రాంతాల్లో దమ్ములకు సిద్ధం





పొలాల్లో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు (ఇన్‌సెట్) ఎద పద్ధతి ద్వారా వేసిన వరి పంట

తుమ్మపాల: తొలకరి పలకరింపుతో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మండలంలో ఇటీవల ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో బోర్లు, మోటార్లు కలిగిన రైతులు పంటపొలాల్లో ట్రాక్టర్లతో దమ్ములు చేసుకుని వరివిత్తు నాటేందుకు సిద్ధం అవుతున్నారు.

ఐదు వేల ఎకరాల్లో వరి సాగు

మండలంలో కొత్తూరు మినహా దాదాపు అన్ని గ్రామాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా గతేడాది 5,490 ఎకరాల పల్లం భూముల్లో రైతులు వరి సాగు చేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది కూడా అంతే విస్తీర్ణంలో వరి సాగు చేసేందుకు సన్నద్ధమైన రైతులు ఇప్పటికే నారుమడుల్లో వరి విత్తనాలు వేశారు. మిగిలిన భూముల్లో అధికంగా సరుగుడు, యూకలిప్టస్ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. చెరకు, కూరగాయలు, ఉద్యాన పంటల సాగుపై కూడా రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

పల్లపు గ్రామాల్లో దమ్ములకు సిద్ధం

మండలంలో శారదానదికి సమీపంలో ఇరువైపుల తుమ్మపాల, సీతానగరం, వెంకుపాలెం, తగరంపూడి, జగన్నాథపురం, దిబ్బపాలెం, ఊడేరు, బవులువాడ. కుంచంగి, కూండ్రం తదితర గ్రామాల్లో వర్షపునీటితో పాటు సాగునీటి కాలువల ద్వారా ప్రతి ఎకరాకు నీరు అందుతోంది. దీంతో ఎక్కువగా వరి సాగు జరుగుతోంది. ఖరీఫ్‌లో వరి సాగుచేసే రైతులు వరినారు మడులు సిద్ధం చేసినా దమ్ములకు పుష్కలంగా నీరు లేకపోవడంతో బోర్లు, మోటార్ల ద్వారా నీటిని తోడి ట్రాక్టర్లతో దమ్ములు సిద్ధం చేస్తున్నారు. ఏటి కాలువల ద్వారా సాగునీరు అందిన వెంటనే వరినాట్లు వేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు

మండలంలో సగానికి పైగా గ్రామాలు కోడూరు, కొండుపాలెం, గోపాలపురం, మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం, గొలగాం, రేబాక, చింతనిప్పులఅగ్రహారం, మామిడిపాలెం, పాపయ్యపాలెం వగైరా మెట్ట ప్రాంతాల్లో కేవలం వర్షం ఆధారంగా వరి సాగు జరుగుతుంది. సాగునీటి కాలువల సౌకర్యం ఉన్నప్పటికి సాగునీరు వచ్చే పరిస్థితులు కల్పించడంలో ఆయా శాఖల సమన్వయలోపం కారణంగా ఇప్పటికీ అది సాధ్యం కాలేదు. దీంతోపాటు కూలీల కొరత, పెరిగిన ధరలు తట్టుకోలేక రైతుల్లో చాలామంది ప్రత్యామ్నాయ పంటల సాగువైపు వెళ్లిపోయారు. కొంతమంది రైతులు ఎద పద్ధతిలో వరి పండిస్తున్నారు. మండలంలో ఎద పద్ధతి ద్వారా దాదాపు 500 ఎకరాలకు పైగా వరి సాగు జరుగుతోంది. ఈ ఏడాది కూడా ఆయా గ్రామాల్లో ఇప్పటికే ఎద పద్ధతిలో వరి విత్తనాలు నాటారు.

ఆగస్టులో పూర్తిస్థాయిలో వరినాట్లు



మండలంలో 5,490 ఎకరాల్లో వరి సాగుచేసేందుకు రైతులు వరినారు మడులు వేసుకున్నారు. బోర్లు ఉన్న రైతులు పైపు లైన్ల ద్వారా దమ్ములు చేసుకుని వరినాట్లకు సిద్ధపడుతున్నారు. మిగిలిన రైతులు దమ్ములకు సరిపడా వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం చినుకులు నారుమడులకు అనుకూలంగా ఉన్నాయి. మరో 15 రోజుల్లో అంటే ఆగస్టు నెల మొదటి వారంలో పూర్తి స్థాయిలో వరినాట్లు ప్రారంభించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడుతుంది.

– పి.వి.బి రంగాచారి, మండల వ్యవసాయ అధికారి, అనకాపల్లి

వెదురుపర్తిలో గర్భకోశ చికిత్స శిబిరం



పాడి రైతులకు మందులు అందిస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ప్రసాదరావు

- 54 పశువులకు వైద్యసేవలు

కశింకోట: పశువులకు ఆడ పెయ్యిలు మాత్రమే ఉత్పత్తి కావడానికి లింగ నిర్ధారిత వీర్యం జిల్లాలోని పశు వైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉందని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బెహరా ప్రసాదరావు తెలిపారు. దీనిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని వెదురుపర్తి గ్రామ రైతు సేవా కేంద్రంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 54 పశువులకు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆవులకు గాని, గేదెలకు గాని కేవలం ఆడ పెయ్యిలు ఉత్పత్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం సహకారంతో లింగ నిర్ధారిత వీర్యాన్ని అందిస్తున్నారన్నారు. దీని అసలు ఖరీదు రూ.1350 అని, కేంద్ర ప్రభుత్వం రూ.850 రాయితీతో రూ.500కు అందిస్తోందని చెప్పారు. అలాగే సాధారణ గర్భధారణ వీర్యం రూ.40కి అందిస్తారన్నారు. దీనితో సగం ఆడ, సగం మగ పెయ్యిలు ఉత్పత్తి అవుతాయన్నారు.

అలాగే, వీర్యం వల్ల గర్భధారణ జరగని పశువులకు ఆరోగ్యంగా ఉండే పెయ్యిలు ఉత్పత్తి చేయడానికి అనుకూల పరిస్థితులు ఉంటే పిండ మార్పిడి విధానం కూడా అనకాపల్లి, మాడుగులలో అందుబాటులో ఉందని తెలిపారు. పుంగనూరు తదితర జాతులను ఈ విధానంలో ఉత్పత్తి చేస్తారన్నారు. ఇందుకు జాతి ఉత్పత్తిని అనుసరించి రుసుం వసూలు చేస్తారని వివరించారు. ఈ సందర్భంగా ఖనిజ లవణ మిశ్రమాన్ని రైతులకు ఉచితంగా సరఫరా చేశారు. 20 పెయ్యిలకు నట్టల నివారణ మందులు అందించారు. పశువుల పేడ పరీక్షలు కూడా శిబిరంలో నిర్వహించారు. జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి. రామ్మోహనరావు, అనకాపల్లి సహాయ సంచాలకురాలు బి.సౌజన్య, మండల పశు వైద్యాధికారి ఆల్ఫోన్స్ జార్జ్, నరసింగబిల్లి పశు వైద్యాధికారి చైతన్యమణి, శస్త్ర చికిత్స నిపుణురాలు పి.భానుబాబు, సర్పంచ్ శనివాడ అరుణ, ఉప సర్పంచ్ అల్లవరపు కొండయ్య, ఎంపీటీసీ సభ్యుడు కొత్తెం రాము, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పందల ఎల్లయ్యనాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

2 కేజీల గంజాయి స్వాధీనం



పోలీసుల అదుపులో గంజాయి తరలిస్తున్న వ్యక్తి

పాయకరావుపేట : మండలంలో గల నామవరం సమీపాన మోటారు సైకిల్‌పై 2 కేజీల గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ బి.జోగారావు తెలిపారు. నక్కపల్లి మండలం చిన రాంభద్రపురం గ్రామానికి చెందిన వ్యక్తి గంజాయిని 100 గ్రాముల పొట్లాలు కట్టి, ఒక్కొక్క పొట్లం 200 రూపాయిలకు అమ్మకం సాగిస్తున్నట్లు గమనించినట్లు తెలిపారు. అతన్ని అదుపులోకి తీసకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ జోగారావు తెలిపారు.

యాత అనుబంధ కులాలపై ప్రభుత్వం చిన్నచూపు



సమావేశంలో పాల్గొన్న యాత అనుబంధ కులాల సంఘ అధ్యక్షుడు లోకనాథం, గీత కార్మికులు

యలమంచిలి రూరల్: యాత అనుబంధ కులాల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని నియోజకవర్గ యాత అనుబంధ కులాల సంఘం అధ్యక్షుడు ఇల్లా లోకనాథం ఆరోపించారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ కులాలకు చేసిందేమీ లేదన్నారు. యలమంచిలి సమీపంలోని ఓ ప్రైవేటు లేఅవుట్‌లో మండల యాత సంస్కృత సేవ గీత కార్మికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం యాత అనుబంధ కులాల కుటుంబాల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన యాత అనుబంధ కులాలను ఆదుకోవాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు, పథకాలు రావాలంటే యాత అనుబంధ కులాల వారంతా ఐక్యతతో పోరాడాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో రేగుపాలెం గీత కార్మికుల సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి అప్పారావు, ఏటికొప్పాక మాజీ ఉప సర్పంచ్ దారా అప్పారావు, పోలవరపు వరహాలు, దుంగ అప్పారావు, పిట్ల సన్యాసిరావు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి ఫిజియోథెరపిస్ట్ నియామకం



విద్యార్థికి ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట : పట్టణంలో గల భవిత కేంద్రానికి ఫిజియోథెరపిస్టును ప్రభుత్వం నియమించినట్లు మండల విద్యాశాఖ అధికారి జి.రమేష్ బాబు తెలిపారు. మానసిక, శారీరక వైకల్యం కలిగిన దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ నిర్వహిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

అనకాపల్లి: మండలంలోని కొత్తూరు విద్యుత్‌శాఖ సబ్‌స్టేషన్ పరిధిలో వైర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు ఫీడర్ పరిధిలో కొత్తూరు, పిసినికాడ, సత్యనారాయణపురం, మూలపేట, సంపతిపురం, వేటజంగాలపాలెం, రొంగలివానిపాలెం, కుంచంగి, కూండ్రం గ్రామాల్లో పైన తెలిపిన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలి



ఉపాధ్యాయులు, ఎండీఎం నిర్వాహకులతో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి అప్పారావు

గొలుగొండ: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ సక్రమంగా ఉండాలని, రోజూ ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని ఉప విద్యాశాఖాధికారి అప్పారావు సూచించారు. గురువారం ఆయన చోద్యం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించారు. ముందుగా పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం, నాణ్యతతో పదార్థాలను వండి, వడ్డించాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో సత్యన్నారాయణ, హెచ్‌ఎం రత్నాజీతోపాటు, ఉపాధ్యాయులు ఉన్నారు.

10 మద్యం బాటిళ్లు స్వాధీనం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో గురువారం అక్రమంగా తరలిస్తున్న పది మద్యం క్వార్టర్ సీసాలను పట్టుకుని, స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. వీటిని తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన చిన్ని అప్పారావును అరెస్టు చేశామన్నారు.

కుష్టు వ్యాధి అవగాహన సర్వే పరిశీలన

పాయకరావుపేట : జాతీయ కుష్టు వ్యాధి నివారణ అవగాహన కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ పరిశీలించారు. కుష్టువ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో బాలాజీ పరిశీలించి వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం అందిస్తున్న కర్రి అప్పారావు, కౌలు రైతులు

మునగపాక: అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ గురువారం ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు ఆధ్వర్యంలో స్థానిక సచివాలయ ఉద్యోగికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేల సాయాన్ని అందజేయాలన్నారు. అర్హులైన కౌలు రైతులకు కార్డులు ఇవ్వడంతో పాటు రుణ సదుపాయం కల్పించాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బ్రహ్మాజీ, కౌలు రైతులు దాడి నాయుడు, ఆదారి రమణబాబు, సూరి సన్యాసినాయుడు, అచ్చియ్యనాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో ‘పొలం బడి’ నిర్వహించండి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు

తుమ్మపాల: రైతులకు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రతి మండలంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు అధికారులను ఆదేశించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులకు గురువారం పొలం బడి, గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన పొలం బడి కార్యక్రమం ద్వారా రైతులకు అందించే సేవలు, సూచనలపై అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్ చిరంజీవి మాట్లాడుతూ పొలం బడి కార్యక్రమానికి ఎంపికైన రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులై ఉండాలన్నారు. పొలం బడి ద్వారా నిర్దేశించిన(ఎంటీయూ-1341, 1273, 1290, 1293, 1010, 1153,1156, బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048) వరి రకాలను మాత్రమే పండించాలన్నారు. విత్తనం నుంచి పంట కోత వరకు నిర్దేశించిన మంచి వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ ఏపీఎస్‌వోపీసీఏ సర్టిఫికెట్ పొందిన తరువాత వారి ఉత్పత్తులను రైతు ఉత్పత్తిదారుల సంఘం తరఫున మంచి ధరకు విక్రయించుకోవచ్చునన్నారు.

గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో జిల్లాకు 30 యూనిట్ల(ఒక యూనిట్‌కు 25 ఎకరాలు)కు సంబంధించి 21 మండలాల్లో 225 క్వింటాళ్ల మూల విత్తనాన్ని(క్వింటాకు రూ.1750 రాయితీపై) రైతులకు అందించామన్నారు. ఆర్‌జీఎల్-2537 వరి రకం యూనిట్లకు సంబంధించి ఏపీఎస్ఎస్‌సీఏ నిబంధనలకు లోబడి రైతుల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి



ర్యాలీలో పాల్గొన్న జిల్లా పదో అదనపు న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య

అనకాపల్లి : ప్రమాదాల నుంచి రక్షించుకునేందుకు ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, పదో అదనపు న్యాయమూర్తి సందనవనం శ్రీవిద్య అన్నారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయస్థానాల నుంచి నెహ్రూచౌక్ వరకూ గురువారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలతో ఎన్నో కుటుంబాల జీవితాలు ఛిన్నాభిన్నాం అవుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణలో భాగంగా వాహన చోదకులతో పాటు వెనక కూర్చున్న వారు సైతం హెల్మెట్ ధరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.రమేష్, రెండో అదనపు తరగతి జూనియర్ సివిల్ న్యాయమూర్తి విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జె.వి.ఎన్.కుమార్, కార్యదర్శి దుర్గారావు, మహిళా ప్రతినిధి కేతా కుసుమ, ట్రాఫిక్ సీఐ పైడపునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంఏఎల్ కళాశాలను సందర్శించిన నాక్ బృందం



ఏఎంఏఎల్ కళాశాల ప్రాధాన్యతను నాక్ బృందానికి వివరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

తుమ్మపాల: స్థానిక ఏఎంఏఎల్ కళాశాలను గురువారం నాక్ అక్రిడిటేషన్ జాతీయ బృందం సందర్శించింది. హిమాచల్‌ప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ హస్‌రాజ్ శర్మ, తమిళనాడు కోయంబత్తూరు హోమ్ సైన్స్ అండ్ హయర్ ఎడ్యుకేషన్ ఆఫ్ వుమెన్ డీన్ డాక్టర్ జెరీనాబి ఉబైదుల్లా, కర్ణాటక ఎ.వి.కాంతమ్మ ఉమెన్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజకుమారి జవరాజిగౌడ.. కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న విద్యా ప్రమాణాలు, వసతి, మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. నాక్ అక్రిడిటేషన్ గుర్తింపునకు అనువైన అంశాలను, ప్రమాణాలను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ కళాశాలలో నాణ్యమైన విద్యా బోధన ఎప్పుడూ సాగుతోందన్నారు. ప్రొఫెసర్ హస్‌రాజ్‌శర్మ మాట్లాడుతూ కళాశాలకు సంబంధించి పూర్తి సమాచారం సేకరించి నివేదికను ఉన్నత స్థాయి అధికారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కృష్ణంరాజు, రిటైర్డ్ ఐజీ మళ్ళ వెంకటేశ్వరరావు, మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర సంచాలకులు కర్రి అప్పారావు, ప్రొఫెసర్ ఎం.వి.కామరాజు, ప్రముఖ వైద్యులు డాక్టర్ జె.ఎ.వి.సుబ్రహ్మణ్యం, డాక్టర్ కర్రి భాస్కరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు, కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పశు షెడ్ల నిర్మాణంలో వివక్ష తగదు



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పశు షెడ్ల నిర్మాణంలో వివక్ష కనబరచడం తగదని ఏపీ గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్ అన్నారు. స్థానిక దొడ్డి రాము నాయుడు భవనంలో గురువారం సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గేదెలు, ఆవులు పెంపకందారులకు 90 శాతం సబ్సిడీతోను, గొర్రెలు, మేకలు పెంపకందారులకు 70 శాతం సబ్సిడీతో ఉపాధి హామీ పథకం ద్వారా షెడ్లు నిర్మిస్తామని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ప్రకటించారన్నారు. ఇటువంటి వివక్షత సరైనది కాదని, పెద్ద పశువుల మాదిరిగా గొర్రెలు, మేకలకు 90 శాతం సబ్సిడీతో షెడ్లు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. నట్టల నివారణ కోసం జూన్ మాసంలో చేపట్టాల్సిన డీ వార్మింగ్, వ్యాక్సినేషన్‌ను తక్షణం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఉరిగిటి శివసూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గోకాడ దేముడునాయుడు, నాయకులు సబ్బి శ్రీనివాసరావు, పినిబోయిన అప్పారావు యాదవ్, బొట్ట వరహాలు, పల్లా సత్యారావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



ఆస్పత్రి వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన మత్తు వ్యసన విముక్తి విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎస్.క్రాంత్‌కుమార్, బి.నాయుడు బాబు, జి.కీర్తన, జి.రాజ్యలక్ష్మి, ఎల్.శ్రీదేవి, చంద్రశేఖర్, ఎస్.వెంకటరావు మాట్లాడుతూ 12 నెలల పాటు జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జీతాలు చెల్లించాలన్నారు. జీతాలు చెల్లించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు చెప్పారు.